# ఎన్నికల అక్రమాలపై 'సీ-విజిల్'

- ఫిర్యాదు చేయాలన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్
- సీ-విజిల్ ద్వారా ఇప్పటి వరకు 13 కేసులు నమోదు.. పరిష్కారం



సాక్షి,మేడ్చల్ జిల్లా: బాధ్యతగల పౌరులుగా ఎన్నికలలో అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలనుకుంటే సీ- విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎవరైనా డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభ పెట్టిన, మద్యం సరఫరా చేసినా, నేరపూరిత చర్యలతో భయభ్రాంతులకు గురిచేసినా, లెక్కకు మించిన ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా... తాజా ఫొటోల తోసహా వీడియోలు, ఆడియో రికార్డ్‌లతో సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎక్కడైతే ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందో దానికి సంబంధించిన ఫొటో లేదా వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 100 నిమిషాలలోపే ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదుపై ఐదు నిమిషాలలోపే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో ఉండే మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిమిషాలలోపు క్షేత్ర పరిశీలన అధికారి అయిన ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను విచారణ నిమిత్తం పంపిస్తారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ 15 నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకొని క్షేత్ర విచారణ చేసి, 30 నిమిషాలలో వివరాలు సేకరించి, తమ నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి నివేదిస్తారని పేర్కొన్నారు. దానిపై రిటర్నింగ్ అధికారి 50 నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో కూడా 24 గంటలు సీ- విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఫిర్యాదు చేసినవారి పేర్లు, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. సీ-విజిల్‌లో ఫిర్యాదు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, తీరా ఆ ప్రదేశానికి చేరుకునే లోపు ఆధారాలు లేకుండా ఉండటం వల్ల సమయం వృథా అవుందన్నారు. గతంలో ఇలాంటి పొరపాట్లు గమనించినట్లు గౌతమ్ తెలిపారు. పక్కా రుజువులు ,ఆధారాలు ఉన్నప్పుడే సీ-విజిల్‌కు ఫిర్యాదులు చేయాలని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా సీ- విజిల్ యాప్ ద్వారా 13 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

# మోదీ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరికలు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్



రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన కొకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి, అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలు బీజేపీలో చేరుతున్నారని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్‌కు చెందిన నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ పరిధిలోని మారుతీ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో చంద్రారెడ్డితోపాటు పలువురికి బీజేపీ కండువాలు కప్పి రాజేందర్ బీజేపీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని ఎత్తులు, జిత్తులు చేసినప్పటికీ తెలంగాణలో కూడా మెజార్టీ పార్లమెంట్ సీట్లను బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు కొంపల్లి మోహన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, అమరమోహన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, శ్యాంసుందర్, రాజిరెడ్డి, మల్లేష్‌యాదవ్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆచలోనావిధానమే సరైన మార్గం



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న కల్యాణ్ శ్రీనివాస్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: పేద, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అంబేడ్కర్ గొప్ప ప్రభావశీలి అని, భారతదేశానికి అంబేడ్కర్ ఆచలోనావిధానమే సరైన మార్గమని హెచ్‌సీఎల్ స్టాఫ్టవేర్ ఇంజినీర్ కల్యాణ్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల చరిత్ర తెలియజేయడమంటే రాజ్యాధికారానికి పునాది అని, వారి ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసు, అశోక్, రాందాసు, రాజేశ్‌కుమార్, సత్యం, ఆనంద్ పాల్గొన్నారు.

# అక్రమార్కులకు కాంగ్రెస్‌లో చోటులేదు



చీర్యాలలో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, నక్కాప్రభాకర్‌గౌడ్ తదితరులు

కీసర: బీఆర్ఎస్ హయాంలో అక్రమాలకు పాల్పడి అడ్డగోలుగా కబ్జాలు చేసినవారికి కాంగ్రెస్‌లో చోటు లేదని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కీసర ఎంపీపీ ఇందిరతోపాటు శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణగౌడ్ తన అనుచరులతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం చీర్యాలలోని ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ నివాసంలో జరిగిన కార్యక్రమంలో వజ్రేషయాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి వారిని పార్టీలోకి ఆహ్వానిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీ సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మహేష్‌గౌడ్, పద్మనాగభూషణం, మండల పార్టీ అధ్యక్షులు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు కందాడి శివరాంరెడ్డి, నాయకులు జయరాం, జూపల్లి రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సమస్యకు ఇదో పరిష్కారం!



తుమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన మండే చెత్త కుండీ



శుభ్రంగా కనిపిస్తున్న కట్టపై భాగం రోడ్డు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని తుమ్మ చెరువులో కొందరు ఏమాత్రం బాధ్యత లేకుండా చెత్త వేస్తుండటంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది దానికి ఓ పరిష్కారం కనుగొన్నారు. చెరువుకట్టపై చెత్త వేస్తే రూ.5 వందల జరిమానా అని బోర్డులు ఏర్పాటు చేసినా చెత్త వేయడం మానలేదు. అయితే గ్రంథాలయం వైపున్న చెరువు భాగంలో ఎక్కువగా చెత్త వేస్తుండటంతో అక్కడే కట్టపై సిమెంట్ రింగులతో తాత్కాలిక చెత్తకుండీని ఏర్పాటు చేశారు. కుండీని ఒక వైపు కట్ చేసి అందులో చెత్త వేసే విధంగా చేశారు. అందులో నిరంతరం మంట ఉండే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో చెరువు నీటిలో, ఒడ్డులో చెత్తవేసే వారు కుండీలో వేయడం, అది ఎప్పటికప్పుడు కాలిపోవడంతో సమస్య కొంతమేరకు పరిష్కారం అయింది. ఇదే విధంగా చెరువు నలుదిక్కులా ఏర్పాటు చేస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు.



# మత్స్యకారులకు భరోసా..!

## చేపలవేటలో ప్రమాదవశాత్తు మరణిస్తే ..

## వారి కుటుంబాలకు పీఎం మత్స్య బీమా యోజన కింద ఆర్థిక సాయం

- మత్స్యసంఘాల సభ్యులకు మాత్రమే పథకం వర్తింపు
- మరణించిన 90 రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే రూ.5 లక్షల బీమా

సాక్షి,మేడ్చల్ జిల్లా: మత్స్యకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం వారి కుటుంబాలకు భరోసానిస్తోంది. కులవృత్తి అయిన చేపల వేటలో ప్రమాదవశాత్తూ నీటమునిగి, రోడ్డు ప్రమాదం, విద్యుదాఘాతం తదితర కారణాలతో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ప్రధానమంత్రి మత్స్య బీమా యోజన పథకంలో ఆర్థిక సాయం అందజేస్తారు. సామూహికంగా లబ్ధి చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకం పలు మత్స్యకారుల కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోంది.

### మత్స్య పారిశ్రామిక సంఘాల సభ్యులకు వర్తింపు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 80 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 3,474 మంది సభ్యులు ఉన్నారు. 13 మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు, 3 ఫిషర్‌మెన్ మార్కెంటింగ్ కోఆపరేటివ్ సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల సభ్యులందరికీ బీమా పథకం వర్తిస్తోంది. ఈ పథకంలో సభ్యులందరి తరఫున ప్రభుత్వాలే ఏటా ప్రీమియం సొమ్ము చెల్లిస్తాయి. సంఘాల్లో నూతనంగా సభ్యత్వం తీసుకున్న సభ్యులు కూడా సామూహిక ప్రమాదబీమా పథకం సైట్‌లో పేర్లను నమోదు చేసుకుంటే జిల్లా మత్స్యశాఖ అధికారులు పరిశీలించి అర్హులను పథకంలో చేర్చేలా చర్యలు తీసుకుంటారు.

### పరిహారం పొందాలంటే..

ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు బీమా పరిహారం అందాలంటే బాధిత కుటుంబసభ్యులు సకాలంలో జిల్లా మత్స్యశాఖ అధికారులకు దరఖాస్తు అందజేయాల్సి ఉంటోంది. మృతి చెందిన 90 రోజుల్లోగా జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలి. వారిచ్చే దరఖాస్తుపత్రంలో వివరాలు పొందుపర్చి మరో రెండు నెలల్లో పోలీస్ ఎఫ్ఐఆర్, పంచనామా, మరణ ధ్రువీకరణ, వారసత్వ ధ్రువీకరణ, పోస్టుమార్టం పత్రాలను జిల్లా మత్స్యశాఖ అధికారికి అందజేస్తే వారు ఉన్నతాధికారులకు నివేదిస్తారు. సభ్యుల నామినీకి రూ.5 లక్షల బీమా సొమ్ము అందజేస్తారు. ఈ వ్యవహారంలో పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నామినీ బ్యాంకు ఖాతాలో పరిహారాన్ని జమ చేస్తారు. బీమా మంజూరైన బాధితుల పేర్లతో కూడిన జాబితాను జిల్లా కార్యాలయానికి పంపిస్తారు. ఈ పథకంలో జిల్లావ్యాప్తంగా పలు మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థికసాయం అందుతోంది.

### నిరంతరంగా సభ్యుల నమోదు ప్రక్రియ



మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని సభ్యులందరికీ బీమా సౌకర్యం ఉంటుంది. నూతన సభ్యుల నమోదు ప్రక్రియ నిరంతరం జరుగుతోంది. కొత్తగా చేరే సభ్యులకు చేపలు పట్టే నైపుణ్యంలో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తాం. చేపలు పట్టడం, వల విసరడం, వల అల్లడం తదితర పనులు వచ్చిన వారికే సభ్యత్వం ఇస్తాం.

– పూర్ణిమా, జిల్లా మత్స్యశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి

# సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వినోద్‌కుమార్

ఘట్‌కేసర్: సీఎం రేవంత్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సీఎంను వారి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సీఎం సూచించినట్లు వినోద్‌కుమార్ తెలిపారు.

# అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పోచారం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోచారం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటాద్రి టౌన్‌షిప్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోచారం మున్సిపాలిటీలోని అన్నానగర్‌కు చెందిన జి.శ్రీనివాసచారి(39) పోలీసులకు కనిపించకుండా తప్పించుకోవాలనుకున్నాడు. కానీ, పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు చెప్పాడు. నిందితుని వద్ద లభించిన కింగ్‌ఫిషర్ బీర్ సీసాలు 12, రాయల్ స్టాగ్ బాటిల్ 1, ఆఫీసర్స్ చాయిస్ బాటిల్ 1, యాంటిక్విటీ బ్లూ 3 బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# బైక్ చోరీ నిందితుడి అరెస్ట్

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యల నుండి బయటపడేందుకు బైక్ చోరీకి పాల్పడిన నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చంద్రపల్లి గ్రామం చంద్రవిలాస్ కాలనీకి చెందిన సన్నాయిల శ్రీనివాస్(49) పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏపీ24-జే- 2158 నెంబర్ బైక్‌ను నిలిపి వైద్యం చేయించుకున్నాడు. తిరిగి శనివారం ఉదయం వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, పోలీసులు యంనంపేట్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుతుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా బైక్‌ను అపహరించినట్లు ఒప్పుకున్నాడు. విచారణలో నిందితుడు యాదాద్రి జిల్లా వలిగొండ మండలం, నాగారం గ్రామానికి చెందిన నర్సింహ్మగా తేలింది. ఆర్థిక సమస్యల కారణంగా బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రీస్తు పునరుత్థానం



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోనున్న కీసర మండల క్రిస్టియన్ సెమిటరీ నందు ఆదివారం ఈస్టర్ పండుగ ఆత్మీయంగా నిర్వహించారు. కీసర మండల క్రిస్టియన్ సెమిటరీ అధ్యక్షుడు హర్షవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ పండగ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే యేసుక్రీస్తు పునరుత్థాన పండుగ సందర్భంగా ఆత్మీయుల సమాధులను దర్శించుకొని క్రిస్టియన్ కుటుంబసభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కీసర మండల క్రిస్టియన్ సెమిటరీ అధ్యక్షుడు డాక్టర్ హర్షవర్ధన్, జనరల్ సెక్రటరీ రెవరెండ్ సాల్మన్ రాజు, ట్రెజరర్ రెవరెండ్ గాబ్రియెల్, జాయింట్ సెక్రటరీ పాల్ డేవిడ్, పాస్టర్ రాజేష్, రక్షణసైన్య కోర్ ఆఫీసర్ కెప్టెన్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ఈస్టర్‌పండుగ సందర్భంగా క్రిస్టియన్ల ప్రత్యేక ప్రార్థనలు

# ఖాళీ అవుతున్న 'కారు'

- మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతల వలస
- నమ్మిన వారు.. సీనియర్‌లే ఇతర పార్టీల్లో చేరిక
- బీఆర్ఎస్ నాయకులపై ఒత్తిడి తెస్తున్న కాంగ్రెస్

మేడ్చల్: రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ క్రమేణా ఖాళీ అవుతోంది. మేడ్చల్ నియోజకవర్గంలో ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. గత ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి మల్లారెడ్డి తన కుటుంబంతో కలిసి ఇతర పార్టీల వైపు చూసినా అది సాధ్యం కాకపోవడంతో ప్రస్తుతం స్తబ్దుగా ఉండిపోయారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిలపై కక్ష సాధింపు, పాత కేసులు తోడటం వంటి చర్యలు అధికార పార్టీ చేపడుతోందని, అందుకే బీఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీల్లోకి వెళ్లడానికి మొగ్గుచూపుతున్నారని కార్యకర్తలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకుల వలసలను నిలపాల్సిన సీనియర్‌లే పార్టీ నుంచి జంప్ చేయడానికి సిద్ధమవుతున్నారని వాపోతున్నారు. అయితే బలమైన నాయకులను చేర్చుకోవడానికి అన్ని రకాల అస్త్రాలను అధికార పార్టీ నేతలు వినియోగిస్తున్నారు. ప్రధానంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, చైర్మన్‌లు కార్పొరేటర్లు వంటి వారిపై కాంగ్రెస్ నేతలు ఒత్తిడి వ్యూహం అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు చేసే వ్యాపారాల్లో ఏమాత్రం లొసుగులు దొరికినా వాటిని ఉపయోగించుకుంటున్నారు. అధికార పార్టీల్లోకి వస్తే కడిగిన ముత్యం అవుతారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అన్నీ తాము చూసుకుంటామని, పార్టీ మారాలని ఒత్తిడి తెస్తున్నారు.

### వారి బలహీనతలు.. వీరికి బలం..

- కాంట్రాక్టర్లుగా ఉన్న నాయకులకు బిల్లులు రాకుండా చేయడం, ఎలాంటి కాంట్రాక్ట్ పనులు రాకుండా చేయడం, ప్రతి విషయన్ని బూతద్దంలో చూస్తుంటడంతో బీఆర్ఎస్ నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది కాంగ్రెస్, మరికొంతమంది బీజేపీలోకి వెళుతున్నారు. ఇటవలే ఓ మున్సిపల్ చైర్మన్ తన స్వంత భవనాలు నిర్మించుకుంటుంటే అవి అక్రమమని అధికారుల చేత కొందరు నోటీసులు జారీ చేయించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి మేడ్చల్‌లో ఉన్న భవనాలు అక్రమమని, వాటిపై చర్యలు తీసుకోవడానికి అధికారాన్ని కాంగ్రెస్ నాయకులు ఉపయోగిస్తూ బీఆర్ఎస్ నాయకులను ఇరుకున పెడుతున్నారు. ఇలా ప్రతి చిన్న అవకాశాన్ని ఉపయోగించుకుంటూ బీఆర్ఎస్ నేతలకు దిక్కుతోచని పరిస్థితి కలిపిస్తూ వారి బలహీనతలను దెబ్బతీసి బలపడాలని అధికార పార్టీ నేతలు స్కెచ్ వేస్తున్నారు.

### జంప్ జిలానీల లిస్ట్ పెద్దదే..

- బీఆర్ఎస్ అధికారం ఉన్న రోజుల్లో ఏకఛత్రాధిపత్యం నడిపించిన నాయకులు కుంటిసాకులు చూపుతూ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. మేడ్చల్ జెడ్పీటీసీ సభ్యురాలు శైలజవిజయానందరెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి వంటి అగ్రనాయకులు ఇప్పటికే బీఆర్ఎస్‌ను వదిలిపోయారు. వీరిలో ఒకరు కాంగ్రెస్‌లో, మరొక బీజేపీలో చేరారు. తాజాగా నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి బీజేపీ కండువా కప్పుకున్నారు. జవహర్‌నగర్‌లో క్యాంపు రాజకీయాలు నడిపి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకుని బీఆర్ఎస్ మేయర్‌ను దించి కాంగ్రెస్ మేయర్ శాంతిని ఎన్నుకునేలా చేశారు.

### ఇద్దరు ఎంపీపీలు...

- మేడ్చల్ ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి కుటుంబానికి రాజకీయ గురువుగా ఉన్న నందారెడ్డి బీజేపీలోకి మారడంతో ఎంపీపీని బీజేపీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారు పార్టీ వీడటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. కీసర ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ వారంలో రోజుల్లో బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెపి కాంగ్రెస్‌లో చేరడానికి ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

### కౌన్సిలర్లు...

మేడ్చల్ మున్సిపాలిటీలో 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు రంగు మార్చడానికి ఇప్పటికే పలు దఫాల్లో కాంగ్రెస్ నాయకులతో మంతనాలు పూర్తి చేశారు. కాగా, చైర్మన్ అభ్యర్థి చేరిక నిలిచింది. బలమైన బీసీ నేత కౌన్సిలర్ మణికంఠ, బీసీ నాయకులు, మైనారిటీ నాయకులతో కలిసి పార్టీ జంప్ చేసి కాంగ్రెస్‌లో చేరిపోయారు. గుండ్లపోచంపల్లికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు రజిత వెంకటేష్, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్‌లో బీజేపీలో చేరగా, మరో ఇద్దరు కౌన్సిలర్లు నేడే రేపో కాంగ్రెస్ గూటికి వెళుతున్నారు. ఉమ్మడి ఘట్‌కేసర్, ఉమ్మడి శామీర్‌పేట్ మండలాలు తూంకుంట, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల నుంచి వలసలు కొనసాగుతునే ఉన్నాయి. ఇలా మేడ్చల్ నియోజకవర్గంలో బలంగా ఉన్న బీఆర్ఎస్ తాజాగా రాజకీయ నాయకుల వలసతో బలహీనంగా కనిపిస్తోంది.

# 'రాజ్యాంగరక్షణ యాత్ర' కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహారావు, మహేశ్

ఘట్‌కేసర్: జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన మాల మహానాడు రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ అధిక అధికసంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు మురళీమోహన్, యాదగిరి, మహేశ్, కుశ, సురేశ్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ గూడూరు సబితఆంజనేయులు గౌడ్, శివసాయి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో బ్రహ్మయ్యకాలనీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం నాగారం మున్సిపల్ కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మధుగౌడ్, పాషబాయ్ తదితరులు పాల్గొన్నారు.

# హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తనా పారాయణం



గీతామందిర్‌లో అఖండ హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన పారాయణం చేస్తున్న భక్తులు

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్ గీతామందిర్‌లో నెల చివరి ఆదివారం పురస్కరించుకొని శ్రీ మద్భగవద్గీత భక్త సమాజం సౌజన్యంతో మెరుగు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అఖండ హరే రామ హరేకృష్ణ నామ సంకీర్తనా పారాయణం చేశారు. శ్రీ సదానంద యోగీశ్వరులు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పారాయణం ప్రారంభించారు. వేల్పుల రాములు జ్ఞాపకార్థం ఆయన భార్య బాలమణి, కూతుర్లు భక్తులకు అన్నదానం చేశారు.

# హారన్ కొట్టాడని డీసీఎం డ్రైవర్‌పై దాడి

ఘట్‌కేసర్: డీసీఎం వ్యాన్ డ్రైవర్ హారన్ కొట్టాడనే నెపంతో ఆయనపై కొందరు దాడి చేశారు. దాడి చేసిన నిందితులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌కు చెందిన కేశవులు ఆదివారం రాత్రి అశోక్ లీలాండ్ వ్యాన్‌లో ఆలేరులో కోళ్లు నింపుకొని ఖైరతాబాద్ వెళుతున్నాడు. ఘట్‌కేసర్ యంనంపేట్ ఓఆర్ఆర్ వద్దకు చేరుకోగానే రెండు ద్విచక్రవాహనాలపై కొందరు వచ్చి డీసీఎంను ఆపి కేశవులపై దాడి చేశారు. దీంతో డ్రైవర్ 100కు కాల్ చేయగా పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా డీసీఎం డ్రైవర్ హారన్ కొట్టడంతో ఓఆర్ఆర్ వంతెన వద్ద డీసీఎంను ఆపి దాడి చేశారని విచారణలో తెలింది. నిందితులు మహేశ్, సయ్యద్, నదీమ్, ఘట్‌కేసర్‌కు చెందిన మైనర్ తేజపై కేసు నమోదు చేశారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.